# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి




## ఓడినా, గెలిచినా, ప్రజల మధ్యలో ఉండాలి: మంత్రి శ్రీధర్ బాబు




# గ్రామ స్వరాజ్యానికి కృషి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన సర్పంచులు తమ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు అన్నారు.రెండవ విడత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచి విజయం సాధించిన పలువురు నూతన సర్పంచులు సోమవారం శ్రీహరి రావును మర్యాదపూర్వకంగా కలిసి, ఆశీస్సులు తీసుకున్నారు. సోన్ మండలం నుండి సోన్ గ్రామ సర్పంచ్‌గా గెలిచిన అంపోలి వనజ కృష్ణ ప్రసాద్‌రెడ్డి, కూచన్‌పల్లి సర్పంచ్ అంకం సుమలత, సిద్ధలకుంట సర్పంచ్ సతీష్ రెడ్డి, కడ్తాల్ సర్పంచ్ గుర్రం రాము, దిలావర్పూర్ మండల కేంద్ర గ్రామ సర్పంచ్ గా గెలిచిన పాల్దే అక్షర అనిల్, నర్సాపూర్ మండల కేంద్ర గ్రామం సర్పంచ్‌గా గెలిచిన ఇంద్రకరణ్ రెడ్డి, మామడ మండలం దిమ్మదుర్తి గ్రామ సర్పంచ్ గా గెలిచిన లక్ష్మణ్, సారంగాపూర్ మండలం కేంద్ర గ్రామ సర్పంచ్ భూమన్న, బోరిగాం సర్పంచ్ గోదావరి, మలక్ చించోలి సర్పంచ్ దాసరి లక్ష్మణ్, అనంతపేట సర్పంచ్ రాజేశ్వర్, వెంగ్వాపేట్ సర్పంచ్ విజయ్ తదితరులు శ్రీహరి రావును కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు నూతనంగా ఎన్నికైనా సర్పంచులందరినీ శాలువాలతో సన్మానించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, సారంగాపూర్ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ్ రాజేశ్వర్ తో పాటు నాయకులు రమేష్, అంపోలి మురళి, కొంతం కాంతయ్య, తిరుకొవ్వెలా వినోద్, సాయి కుమార్, రాము, సప్పల రవి, వీరేందేర్, ఉమా మహేశ్వర్, అజీమ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

---

### అభివృద్ధే ధ్యేయంగా పనిచేసి
# ప్రజల రుణం తీర్చుకుంటా

**ప్రజాపక్షం/ముత్తారం :** మంత్రి శ్రీధర్ బాబు చొరవతో గ్రామాల్లో నూతనంగా గెలిచిన సర్పంచులు అభివృద్ధే ధ్యేయంగా పనిచేసి ప్రజల రుణం తీర్చుకుంటామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చోప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ లు అన్నారు.సోమవారం ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా గెలిచిన సర్పంచులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గం లోని ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో మంత్రి శ్రీధర్ బాబు చొరవతో గ్రామాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. అభినందనీయమన్నారు. అనంతరం నూతనంగా గెలిచిన సర్పంచ్ లను శాలువలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



---

### రాజ్యాంగ బద్ధంగా గ్రామాలకు రావాల్సిన
# ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజ్యాంగ బద్ధంగా గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత నేను తీసుకుంటానని బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం సిరిసిల్ల తెలంగాణ భవన్ మొదటి రెండు విడతలలో గెలిచిన సర్పంచ్ లతో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని, వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బిఆర్‌ఎస్ పార్టీ తరఫున ప్రత్యేక న్యాయ విభాగాన్ని లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బిఆర్‌ఎస్ మద్దతు దారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని భరోసా ఇచ్చారు. మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా పార్టీని సంప్రదిస్తే జిల్లాలో ఏర్పాటుచేసిన లీగల్ సెల్ అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుందన్నారు. కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. కేవలం రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బిఆర్‌ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రజల వ్యతిరేకత నుంచి కాంగ్రెస్ని కాపాడలేకపోయారని కేటీఆర్ అన్నారు.సర్పంచులు కేవలం పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలోని ఏపూర్ గ్రామాన్ని ఉదాహరణగా తీసుకుంటూ.. అక్కడ చెక్ డ్యాంలు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం వంటి నిర్మాణాలతో ఆ గ్రామం దేశంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిందని గుర్తుచేశారు. ఇంతకుముందు బిఆర్‌ఎస్ నాయకుల కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కొండూరి రవీందర్రావు, తోట ఆగయ్య,సుంకే రవి శంకర్, చల్మడ లక్ష్మీ నరసింహారావు, తుల ఉమ, జిందం చక్రపాణి, అరుణ రాఘవ రెడ్డి, సిద్ధం వేణు, మనోహర్ రెడ్డి, మల్లారెడ్డి కొత్తగా ఎన్నికైన సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయ సేకరణకు సహకరించండి




ప్రజాపక్షం/రామగిరి : ప్రజాభిప్రాయ సేకరణకు పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు అన్నారు.సోమవారం జిఎం కార్యాలయంలో నూతనంగా ఎన్నుకోబడ్డ పరిసర ప్రాంతాల గ్రామ సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19న స్థానిక జేఎన్టీయూహెచ్ మంథని కళాశాల క్రీడా మైదానం నందు రామగుండం కోల్ మైన్ పై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామని, కావున పరిసర ప్రాంత ప్రజలు పాల్గొనాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులను శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి ప్రజాభిప్రాయ సేకరణకు ఆహ్వాన పత్రికను అందజేశారు.కార్యక్రమంలో పరిసర ప్రాంత గ్రామ సర్పంచులు వనిత సాయికుమార్, చిందం మహేష్, పల్లె ప్రతిమ పివి రావు, రజిత సుధాకర్, వనం రామచంద్ర రావు, భాగ్యలక్ష్మి కొమురయ్య, సురేష్ ,ఎస్ఓటుజిఎం యం.రామ్మోహన్, పర్యావరణ అధికారి రాజారెడ్డి, అధికారులు బి.వి.సత్యనారాయణ, బి.టి. మురళీకృష్ణ, సుదర్శనం, ఐలయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వేములకుర్తిలో అయ్యప్ప పడిపుజ

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో న్యావనంది వినోద్ కత్తిస్వామి,న్యావనంది నవిన్ ల స్వగృహంలో సోమవారం మెట్పల్లి పటణ అయ్యప్ప స్వామిఅలయ అర్చకులు అశోక్ శర్మ ల కరకమములచే గణపతి ,సుబ్రహ్మణ్యం కలిశ,గంట,అయ్యప్ప స్వామి అభిషేకాలు ,అయ్యప్ప స్వామి అష్టోత్తర, స్వామి వారి 18 మెట్ల పూజ కార్యక్రమం,అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.భక్తులు అయ్యప్ప స్వామి దీక్ష పరులు భజన సంకీర్తనలు అలరించాయి.పూజా కార్యక్రమం అనంతరం స్వామివారికి ఎంతో ఇష్టమైన వేటతుల్లి ఆట ఆడారు.18 మెట్లలకు ప్రత్యేక పుజలు చేసీ కర్పూరం వెలిగించారు. ఈకార్యక్రమంలో గురుస్వాములు ఎలిగేటీ రమేష్,అంకతి భరత్ కుమార్, బందారి మారుతి ,సొడల సంజీవ్, జిందం శ్రీనివాస్, అరె రమేష్,పుప్పాల రాజేష్, గడ్డం పురుషోతం, పత్తిపాక దామేధర్, సోమ ప్రవిణ్, దేశెట్టీ రమేష్, బాజవేని వెంకటేష్ అయ్యప్ప స్వామి దీక్ష పరులు, మహిళలు ,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన వెల్ బెబి షో

ప్రజాపక్షం/రామగిరి : సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక డిస్పెన్సరీ నందు సింగరేణి ఉద్యోగుల కుటుంబాల చిన్నారులకు నిర్వహించిన వెల్ బేబీ షో పోటీలను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు. సింగరేణి ఉద్యోగుల కుటుంబాల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబాల చిన్నారులను ఆరోగ్యకరమైన వాతావరణంలో పెంచడాన్ని ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలను గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహిస్తుందన్నారు. పిల్లలకు వారి చిన్నతనం నుంచే కుటుంబ బంధాలపై అవగాహన కల్పించాలని, క్రమశిక్షణతో పాటు మంచి అలవాట్లు నేర్పిస్తే భవిష్యత్తులో రాణిస్తారన్నారు. పిల్లల అల్లరిని, ఏడుపును తగ్గించడం కోసం తల్లిదండ్రులు సెల్ ఫోన్ ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. పిల్లలను ప్రకృతికి దగ్గరగా పెంచేలా చూడాలని సూచించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన చిన్నారులకు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ఈనెల 23న నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయబడునని తెలియజేశారు.కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు ఎన్.అలివేణి సుధాకరరావు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డాక్టర్లు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, శ్రీనివాస్, పద్మ, సేవా కార్యదర్శి ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి అరుణ,తదితరులు పాల్గొన్నారు.

## అమృత్ 2 అభివృద్ధి పనులు మార్చిలోగా పూర్తి



ప్రజాపక్షం/కరీంనగర్: అమృత్ 2 లో చేపట్టిన మంచి నీటి సరఫరా కు సంబంధించిన అభివృద్ధి పనులను మార్చి లోగా పూర్తి చేసేలా కమీషనర్ల, అధికారులు చర్యలు తీసోవాలని సీడిఎంఏ అధికారి శ్రీదేవి ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టర్ సమావేశ మందిరంలో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈఎన్ సి పబ్లిక్ హెల్త్ అధికారి బాస్కర్ రెడ్డితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, కరీంనగర్ నగర పాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, హుజూరాబాద్ కమీషనర్ సమ్మయ్య, జమ్మికుంట మున్సిపల్ కమీషనర్ ఆయాజ్, చొప్పదండి కమీషనర్ నాగరాజు లతో ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2 పథకం అభివృద్ధి పనుల పురోగతి సుదీర్ఘంగా చర్చించారు. మంచి నీటి సరఫరా పైపులైన్ అభివృద్ధి పనుల్లో సమస్యలు, రిజర్వాయర్ల, సంపుల నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, పలు సూచనలు చేస్తూ, ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీడిఎంఏ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ అమృత్ 2 పథంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నిటిని వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసోవాలని అన్నారు. నీటి సరఫరా పైపులైన్ పనులతో పాటు రిజర్వాయర్లు, సంపుల నిర్మాణం పనులను కూడ త్వగరా పూర్తి చేసేలా చర్యలు తీసోవాలని ఆదేశించారు. పనులను ప్రారంభం చేయకుండా, నత్తనడకన సాగిస్తే అలాంటి కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి వారి పై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అమృత్ లో భాగంగా చేపట్టిన లెక్ పునర్జీవన అనే స్కీం సంబంధించిన అభివృద్ధి పనుల అగ్రిమెంట్లను కూడ పూర్తి చేసి పనులు ప్రారంభం చేయాలని అన్నారు. ప్రభుత్వం యూఐడిఐఎఫ్ ద్వారా విడుదల చేసిన 50 కోట్ల నిధులకు సంబంధించిన అభివృద్ధి పనుల ప్రణాళికలను సిద్ధం చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. వాటి పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్ఈ రాజ్ కుమార్, బబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్ రావు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## రక్షణ రంగంలోకి ఒకే కుటుంబం నుండి ఇద్దరు ఎంపిక



ప్రజాపక్షం/కరీంనగర్: భారత రక్షణ రంగంలోకి ఒకే కుటుంబం నుండి ఇద్దరు అన్న తమ్ముడు ఎంపికైనట్లు డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ వెంకటరెడ్డి తెలిపారు. డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ, డ్రీమ్ జూనియర్ కాలేజ్ తరపున ఒకరు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లోకి, మరొకరు ఇండియన్ ఆర్మీలోకి సెలెక్ట్ అయినట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాలు తమ బోధనకు నిదర్శనమన్నారు. అకాడమీ ఏర్పాటు చేసిన నుండి ఇప్పటి వరకు 1660 మందికి మా సంస్థ ద్వారా ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఒకే బ్యాచ్ లో స్నేహితులు ఉద్యోగాలు సాధించారని కానీ ఇప్పుడు ఒకే కుటుంబం నుండి ఇద్దరు విద్యార్థులు భారతీయ రక్షణ దళాల్లో ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీంతో అకాడమీకి, జూనియర్ కళాశాలపై బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఈ విజయంతో, రాబోయే రోజుల్లో మరిన్నీ విద్యార్థులు ఇలాగే తమ లక్ష్యాలను చేరుకోవడానికి, మార్గదర్శకత కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పల్లెల అభివృద్ధి: ఎమ్మెల్యే

ప్రజాపక్షం/పెద్దపల్లి:కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని, పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి పల్లెల అభివృద్ధికి తోడ్పడాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామారావు పిలుపునిచ్చారు. సోమవారం రోజున పెద్ద పల్లి మండలంలోని నిట్టూరు, పెద్దకల్వల, అప్పన్నపేట, బొంపల్లి, కనగర్తి, పాలితం, కాసులపల్లి, తురకల మద్దికుంట గ్రామాలలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని, కాంగ్రెస్ తోనే పల్లెల ప్రగతి సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేయవచ్చని, దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు ఉచిత కరెంటు, రెండు లక్షల రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పథకం 10 లక్షలకు పెంపు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ, సన్నవడ్లపై బోనస్, కటింగ్ లు లేకుండా వడ్ల కొనుగోలు వంటి ప్రజా ఉపయోగ పనులను తాము అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తించి ఎన్నికల్లో తాము బలపరిచే అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. రెండేళ్ల పదవీ కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశానని, గ్రామాల్లో తాను సూచించిన వారిని సర్పంచులుగా గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయిని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మంగళపల్లి సర్పంచ్

ప్రజాపక్షం/చొప్పదండి: మండలంలోని మంగళపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా ఎన్నికైన పెద్దెల్లి శారద సురేష్ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో సోమవారం భారాస నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే సత్యం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి అర్హులకు అందించాలని అభివృద్ధి విషయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిఎడ్ కోర్సుల్లో ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు నిర్ధారణ

ప్రజాపక్షం/కరీంనగర్: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలకు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బి.ఎడ్) కోర్స్ లో ఒకటవ, మూడో సెమిస్టర్ ఫీజు గడువును రెగ్యులర్, బ్యాక్లాగ్ కొరకు విడుదల చేసింది. పరీక్షలు జనవరి 2026 లో జరుగుతాయని తెలిపారు. పరీక్ష రుసుము 24122025 లోపు చెల్లించవలసిందిగా, 500 రూపాయల అపరాధ రుసుముతో 30122025 వరకు అనుమతించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ లోచూడవలసిందిగా లేదా ఆయా కళాశాలలో సంప్రదించవలసిందిగా శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా॥ డి.సురేష్ కుమార్ తెలిపారు.

## సర్టిఫికెట్ ఆఫ్ అప్రిషేషన్ అవార్డు అందుకున్న ముత్యం శంకర్ గౌడ్

ప్రజాపక్షం/కరీంనగర్: లయన్స్ క్లబ్ లలో సభ్యులను ఎక్కువ సంఖ్యలో చేర్పించి నందుకు లయన్స్ ఇంటర్నేషనల్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ మార్క్ లయోను చేతుల మీదుగా కరీంనగర్ మానేరు క్లబ్ ప్రెసిడెంట్ ముత్యం శంకర్ గౌడ్ కు సర్టిఫికెట్ ఆఫ్ అప్రిషేషన్ అవార్డును హైదరాబాదులోని విశ్వేశ్వరయ్య భవనములో అందించినట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డు అందుకున్న ముత్యం శంకర్ గౌడ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ను జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు లయన్స్ క్లబ్ యొక్క సేవలు అందించడం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ అవార్డు ప్రధానోత్సవం కార్యక్రమంలో 320 జి గవర్నర్ సింహరాజు, కోదండరాములు ఫస్ట్ గవర్నర్ మెగా బ్రిదీశం పాల్గొన్నారు.

## గ్రామాల్లో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుంది

ప్రజాపక్షం/గొల్లపల్లి : గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా గొల్లపల్లి మండల కేంద్రంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఆవుల జమున సత్యం (ఉంగరం గుర్తు) ఓటు వేసి గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజలకు మంచి అవకాశం వచ్చిందని కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు.అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని... కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు.ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు ఒ పాల్గొన్నారు.

## గోధూరు వాసికి డాక్టరేట్ అవార్డు

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన బూరం సంజీవ్ సీనియర్ జర్నలిస్టుకు టోలాన మెక్సికో (అమెరికా) యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డు నుతనెల 14వ తేదీన ఔరంగాబాద్ లో ప్రధానం చేయడం జరిగింది . బూరం సంజీవ్ గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగుతూ ప్రజా సమస్యలపై అనేక కథనాలు రాసినందుకు గౌరవ డాక్టరేట్ అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం బూరం సంజీవ్ టీయు డబ్ల్యు జే (ఐజేయు) మెట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ రావడానికి కృషి చేసిన యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ కాయితి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు మాసుల ప్రవీణ్,మెట్టు దాస్ తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పండ్లు, బ్రెడ్ల పంపిణీ

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆర్యవైశ్య యువజన సంఘం పెద్దపల్లి పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించినట్లు యువజన సంఘం అధ్యక్షులు కాసనగొట్టు వినయ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు అమరణ నిరాహార దీక్ష చేపట్టి అమరజీవిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. దీక్ష చేస్తూనే తెలుగు వారి కోసం అమరుడైన పొట్టి శ్రీరాములు గొప్ప మహనీయులు అని కొనియాడారు. ఆయన మరణంతోనే 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొమురవెల్లి జయరామ్, గౌరిశెట్టి సాయి శివ, తొడుపునూరి రాజేష్, తొడుపునూరి శ్రీనివాస్, నార్ల రాజు, అల్లెంకి అరవింద్, సంకీస సంతోష్, గుండ సాయి వర్మ, ముస్త్యాల భాస్కర్, ఆకాష్ రామ్, గౌరిశెట్టి సంతోష్ పాల్గొన్నారు.



## జిపి మూడో ఫేజ్ ఎన్నికలకు సిద్ధం

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయి. ఈ నెల 17 వ తేదీన బుధవారం ఆయా గ్రామ పంచాయతీలు, వార్డుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది.

**మొత్తం ఓటర్లు..**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాల్లో మూడో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. గంభీరావుపేట మండలంలో 17,811మంది పురుషులు, 18,996 మహిళలు మొత్తం 36,807, ముస్తాబాద్ మండలంలో 18,658 మంది పురుషులు, మహిళలు 19,842 మొత్తం 38,500 ఓటర్లు ఉన్నారు. వీర్నపల్లి మండలంలో 5,769 మంది పురుషులు, 5,958 మంది మహిళలు మొత్తం 11,727 మంది, ఎల్లారెడ్డిపేట మండలంలో 19,690మంది పురుషులు, 21,196 మహిళలు మొత్తం 40,886 మంది ఓటర్లు ఉన్నారు.

**551 పోలింగ్ కేంద్రాలు**

ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాల్లో మొత్తం గ్రామ పంచాయతీలు 87, వార్డు స్థానాలు 762ఉండగా, సర్పంచ్ స్థానాలు 7, వార్డు స్థానాలు 211 ఏకగ్రీవమయ్యాయి. ఈ నెల 17 వ తేదీన బుధవారం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 80, వార్డుల్లో 551 ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులు 379, వార్డు స్థానాలకు 1,526 అభ్యర్థులు మంది పోటీలో ఉన్నారు.

**ప్రణాళిక సిద్ధం**

ఎన్నికలకు మూడు మండలాల్లో కలిపి మొత్తం 914 మంది ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలు 1,244 మంది విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల సామగ్రి, అధికారులు, సిబ్బందిని తరలించేదుకు ఎల్లారెడ్డిపేట మండలంలో మొత్తం జోన్స్ 7, రూట్స్ 10, గంభీరావుపేట మండలంలో జోన్స్ 5, రూట్స్ 10, ముస్తాబాద్ మండలంలో జోన్స్ 4, రూట్స్ 8, వీర్నపల్లి మండలంలో జోన్స్ 2, రూట్స్ 5 ప్రణాళిక సిద్ధం చేశారు. నాలుగు మండలాల్లో కలిపి మొత్తం పోలింగ్ కేంద్రాలు 551 సిద్ధం చేశారు.

**ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా..**

ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితాలో పేరుండి ... ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా ఈ కింద చూపిన 18 ప్రత్యామ్నాయ ఫోటో ఐడీలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఆధార్, భారతీయ పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫోటోతో కూడిన పాస్ బుక్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పిఆ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(RGI) జారీ చేసిన స్మార్ట్ కార్డు, పెన్షన్ పత్రాలు, ఆయుధాల లైసెన్స్, దివ్యాంగ ధృవీకరణ పత్రం, పట్టాదారు పాస్‌బుక్.

## అమృత్ 2.0 పనులు త్వరితగతిన పూర్తి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : అమృత్ 2.0 కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్(ఎంఏ&యూడీ) సెక్రటరీ శ్రీదేవి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని అర్బన్ లోకల్ బాడీల్లో అమృత్ 2.0 కింద చేపట్టిన పనుల పురోగతిపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్ష నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.అమృత్ 2.0 కింద నీటి ట్యాంకుల నిర్మాణం, పైప్ లైన్ వేసే పనులను మొదలు పెట్టగా, అన్ని జిల్లాల వారీగా పనుల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎంఏ & యూడీ సెక్రటరీ శ్రీదేవి మాట్లాడుతూ.. అమృత్ 2.0 కింద చేపట్టిన పనులను నిర్థీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనులను వేగంగా పూర్తి చేసేందుకు కావలసిన సామగ్రి అందుబాటులో ఉండాలని, సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. ఒక ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. పనులపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో అమృత్ 2.0 కింద సిరిసిల్ల నియోజకవర్గంలో రూ. 100 కోట్ల నిధులతో నీటి ట్యాంకులు, పైప్ లైన్ పనులు మొదలు పెట్టారని, ఆయా పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని సూచించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో రూ.13 కోట్లతో చేపట్టిన పనుల పురోగతిపై అభినందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, పబ్లిక్ హెల్త్ డీఈ వరుణ్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## ఒసిపి-2 ఉపరితల గనిలో 56వ వార్షిక భద్రతా పక్షోత్సవాలు

ప్రజాపక్షం/రామగిరి : సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఈనెల 8 నుండి 20 వరకు నిర్వహిస్తున్న 56వ వార్షిక భద్రతా పక్షోత్సవాలను పురస్కరించుకొని రామగుండం 3 ఏరియా లోని ఒసిపి2 ఉపరితల గనిలో భద్రతా తనిఖీ బృందం కన్వీనర్ సి.హెచ్. వెంకట రమణ, సభ్యులు పర్యటించారు.వారికి ముందుగా ప్రాజెక్ట్ అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తనిఖీ బృందం కన్వీనర్ సి.హెచ్.వెంకట రమణ మాట్లాడుతూ ఉద్యోగులు భద్రతపై ఏ మాత్రం అశ్రద్ధ వహించరాదని, అనుక్షణం అప్రమత్తతో ఉంటూ భద్రతతో విధులు నిర్వహిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలని అన్నారు. గతంలో జరిగిన ప్రమాదాలు, సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తూ సింగరేణి సంస్థను ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలని అన్నారు.తదుపరి రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు మాట్లాడుతూ ఉద్యోగులందరికి భద్రతపై అవగాహన కల్పించడం కోసం ప్రతి సంవత్సరం ఈ భద్రతా పక్షోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, అధికారులు, సూపర్వైజర్లు ఉద్యోగులకు భద్రత పట్ల మరింత అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ ఎస్.మధుసూదన్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటు జిఎం యం. రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, పిట్ సెక్రెటరీలు ఎం.సురేష్, ఆర్.మనోహర్, సేఫ్టీ కమిటీ సభ్యులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నివిధాలుగా ధరూర్ గ్రామ అభివృద్ధికి అనునిత్యం కృషి

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : ధరూర్ గ్రామ ప్రజలకు అపద వచ్చిన ప్రతి సారి గుర్తు వచ్చే ప్రజా నాయకుడు గత ఇరవై ఏళ్లు సుదీర్ఘ ప్రజా జీవితంలో ప్రజా సేవ తప్ప మరొకటి తెలియని నాయకుడు, జన హృదయ నేతకు ఘనమైన విజయం సొంతం చేసిన ధరూర్ గ్రామ ప్రజలు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ సర్పంచ్ గా శీలం సురేందర్ భారీ మెజారిటీతో గెలుపొందారు. ధరూర్ గ్రామ సర్పంచ్ గా శీలం సురేందర్ ను ప్రకటించగానే ధరూర్ గ్రామ ప్రజలు, యువకులు పెద్దఎత్తున విజయోత్సవ సంబరాలను టపాసులు కాల్చి స్వీట్స్ పంచి గజామలతో శీలం సురేందర్ ను సత్కరించి అభిమానం చాటుకున్నారు.

ధరూర్ గ్రామ ప్రజల అభిమానానికి ధన్యవాదాలు సర్పంచ్ శీలం సురేందర్ : ధరూర్ గ్రామ ప్రజలు సర్పంచ్ గా భారీ మెజారిటీతో గెలిపించారని ఈ భారీ విజయాన్ని అందించిన ధరూర్ గ్రామ ప్రజలకు, యువకులకు, మహిళలకు ధన్యవాదాలు తెలుపుతూ సర్పంచ్ గా తన గెలుపు ఎంతో ఆనందాన్ని ఉత్సాహాన్ని కలిగించిందని సురేందర్ అన్నారు. తన పై నమ్మకంతో తనను గెలిపించినందుకు ధరూర్ గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తానని, తన గెలుపు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన ధరూర్ గ్రామ ప్రజలు, యువకులకు, మహిళలకు మరోసారి కృతజ్ఞతలు ధరూర్ గ్రామ సర్పంచ్ శీలం సురేందర్ తెలియజేశారు. ధరూర్ గ్రామ చరిత్రలో నాయకుడి గెలుపు కోసం

**మహిళల ప్రచారం :** ఎన్నికల ప్రచారాలు అంతే గ్రామ నాయకులు యువత కొందరు మహిళలతో కలిసి గ్రామ పంచాయతీ ఎన్నికలైనా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల ప్రచారాలు చేయడం మనందరం చూసి ఉంటాం కానీ జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ధరూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా శీలం సురేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మహిళలు అందరు పెద్ద ఎత్తున్న కదిలివెళ్ళి ప్రచారం చేయడం ధరూర్ గ్రామ చరిత్రలో ప్రత్యేకత సంచరించుకుందని గ్రామా ప్రజలు పలువురు అభిప్రాయపడ్డారు.



## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వార్డు సభ్యులుగా గెలుపు

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లాలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వార్డు సభ్యులుగా ఘన విజయం సాధించడం ప్రత్యేకతను సంతరించుకుంది. వివరాల్లోకి వెళ్తే జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన తుమ్మల గంగారం 8 వ వార్డు, తల్లి తుమ్మల నర్సమ్మ 4 వ వార్డు, భార్య తుమ్మల అర్చన 3 వ వార్డు సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసి గెలుపొందారు.తమపై నమ్మకంతో తమకు ఓటు వేసి గెలిపించిన ధరూర్ గ్రామ ప్రజలకు, యువకులకు, మహిళలకు ధన్యవాదాలు తెలియజేస్తూ ధరూర్ గ్రామ అభివృద్ధిలో శక్తికి మించి కృషి చేస్తామని తుమ్మల గంగారం, తుమ్మల నర్సమ్మ,తుమ్మల అర్చన తెలిపారు.

## జన్మదినం సందర్బంగా నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాపక్షం/కోరుట్ల : శ్రీ శివమార్కండేయ కోటినవదుర్గ దేవాలయ చైర్మన్ జిల్లా ధనుంజయ్‌దీపారాణి ల కుమారుడు జిల్లా యశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో యశ్వంత్ తల్లిదండ్రులు, పద్మశాలి సంఘ నాయకులు గడ్డం మధు,32వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ జిందం.లక్ష్మీ నారాయణ, పద్మశాలి సంఘ ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్,ఆలయ కమిటీ డైరెక్టర్లు అడెపు నరేష్, అందె సురేష్, రుద్ర సురేష్ , దైవశెట్టిలు, అల్లె లక్ష్మీ నారాయణ, గణేష్, పాల్గొన్నారు.

## గెలుపు, ఓటములు సహజం: అధైర్య పడొద్దు

ప్రజాపక్షం/మల్లాపూర్: రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమి పాలైన అభ్యర్థులు ఎవరు కూడా అధైర్య పడద్దని బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. ముత్యంపేట రత్నాపూర్ గ్రామాలలో టిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులను పరామర్శించి అధైర్య పడద్దని పార్టీ ఎల్లవేళలా భరోసాగా ఉంటుందని ప్రజలకు నిరంతరం సేవ చేయాలని సూచించారు. వీరి వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సర్పంచ్ తోట శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు డీలర్ మల్లయ్య, రాజన్న తదితరులున్నారు.

## నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు ఘన సన్మానం

ప్రజాపక్షం/మల్లాపూర్ : ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సాతారం సర్పంచ్గా ఎన్నికైన పోతవేణి నారాయణ (కిషన్ గౌడ్) గుండంపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికైన దప్పుల పద్మ నరసయ్యను మెట్పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ దేవరాజు సోమవారం ఘనంగా సన్మానించారు. కాగా ఇరువురిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగాకలిసి శుభాకాంక్షలు తెలిపి సాల్వాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, డిపో సిబ్బంది చంద్రయ్య చంద్రశేఖర్, గుండంపల్లి జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు చంద్రప్రకాష్,గ్రామస్తులు అశోక్ ,నరేష్, చింటూ,తదితరులున్నారు.

## ఎర్రజెండాను... నిలబెట్టిన 'జూపాక'

ప్రజాపక్షం/గోదావరిఖని : పెద్దపల్లి జిల్లాలో లెఫ్ట్ పార్టీల మద్దతుతో పలువురు సర్పంచి పదవి కోసం ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఎక్కడ విజయం సాధించలేకపోయారు. మహిళగా అవకాశం రావడంతో పోటీలో నిలబడి తొలిసారే విజయాన్ని కైవసం చేసుకున్నారు జూపాక మమత. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి, పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జూపాక శ్రీనివాస్ గ్రామ పంచాయతి సర్పంచి ఎన్నికల్లో తన భార్య మమతను నిలబెట్టారు. సోమవారం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నంది రామయ్య, సత్యనారాయణ రెడ్డి, పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి రమేష్, వెంకన్న, శంకర్, చంద్రయ్య, భూషణవేణి కృష్ణ, రాములు నూతన సర్పంచి జూపాక మమతశ్రీనివాస్‌లను అభినందించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ సర్పంచిగా గెలుపు బాధ్యతను మరింత పెంచిందని, ప్రజా సమస్యలను పరిష్కరించి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఆమె తెలిపారు.

# లీగల్ ఎయిడ్స్ క్లినిక్‌ను సీనియర్ సిటిజన్‌లు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సీనియర్ సిటిజన్ లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు.సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ పెద్దపల్లి ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ప్రతి సోమవారం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ప్యానల్ న్యాయవాదులు ఎస్.అశోక్ కుమార్, లీగల్ వాలంటరీ ఎస్.మల్లేష్ అందుబాటులో ఉంటారని, పిల్లలతో సమస్యలు ఎదుర్కొంటున్న వృద్ధ తల్లిదండ్రులు ఇక్కడ తమ ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, ఎఫ్ ఆర్ ఓ స్వర్ణలత, న్యాయ సేవ ప్రాధిక సంస్థ అధికారులు శేఖర్, అశోక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి వ్యూహాత్మక భాగస్వామ్యంతో పారిశ్రామిక ప్రగతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్ర ఐటీ మరియు ఇండస్ట్రీస్ మంత్రివర్యులు దుదిల్ల శ్రీధర్ బాబును సోమవారం బీసీ సామాజిక ఉద్యమకారుడు తాడూరి శ్రీమన్నారాయణ మంత్రి నివాసంలో ఘనంగా సన్మానించారు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల రాష్ట్రానికి ఐదు లక్షల అరవై వేల కోట్ల పెట్టుబడులు రావడం పరిశ్రమల శాఖ మంత్రిగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన కానుకగా పేర్కొన్నారు ప్రపంచ పారిశ్రామిక సదస్సు దావోస్ లో జరిగిన భాగస్వామ్యంతో కూడా లక్ష అరవై వేల కోట్ల పెట్టుబడును తీసుకురావడం రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టించడం దేశంలో ఏ ఐటి మంత్రి దక్కని ఘనవిజయమని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన సెమీ కండక్టర్ పరిశ్రమ పెద్దపెల్లి జిల్లాలో ఏర్పాటు చేసేందుకు కేంద్రంతో మాట్లాడవలసిందిగా ఈ సందర్భంగా గుర్తు చేసినట్లు తాడూరు శ్రీమన్నారాయణ తెలిపారు.

## ఎన్నికల ప్రచారంలో డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్



**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం గ్రామపంచాయతీ ఎన్నికల్లో రెండు దశల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి ఫలితాలు ఇచ్చిన ఓటర్లందరికి కృతజ్ఞతలు తెలిపారు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ సోమవారం ముస్తాబాద్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ముస్తాబాద్ సర్పంచ్ గా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏళ్ళ బాల్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు లబ్ధిచేకూరుస్తున్నాయని తెలిపారు. అభివృద్ధిలో ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎల్లబాల్రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

## 'తడోబా' టూ రామగుండం.. పెద్దపులి..!



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం మండలం లింగాపూర్ సమీపాన మూసివేసిన సింగరేణి మేడిపల్లి ఒసిపి4 ప్రాజెక్టులోకి పెద్దపులి ప్రవేశించిన విషయం విదితమే. ఇక్కడి సింగరేణి, అటవీశాఖకు చెందిన 650 హెక్టార్ల భూమి నేడు అరణ్యంలా మారింది. ఈ అరణ్యంలోనే పెద్దపులి సంచరిస్తుంది. తాజాగా సోమవారం లింగాపూర్ పంపుహౌజ్ ఏరియా వద్ద మట్టి దారిపై పులి అడుగు జాడలను గుర్తించారు. అటవీశాఖ కాళేశ్వరం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు డాక్టర్ బి.ప్రభాకర్ పులి అడుగులను పరిశీలించారు. పెద్దపులి సంచారం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తడోబా అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ పెద్దపులి వారం రోజుల క్రితం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ సింగరేణి ఏరియా ప్రాంతం మీదుగా గోదావరినది దాటి రామగుండం మేడిపల్లి ఒసిపి4 ప్రాజెక్టులోకి ప్రవేశించింది. పది రోజులుగా అటవీశాఖ అధికారులు, ట్రాకింగ్ సిబ్బంది పులి అడుగుజాడలను గమనిస్తూ ఎక్కడికి వెళ్లి ఉంటుందోనని అన్వేషణ కొనసాగిస్తున్నారు. అయితే ఈ పులి కొద్ది రోజులు మాత్రమే ఇక్కడ ఉంటుందని అనంతరం ఏలా వచ్చిందో అలానే తిరిగి వెనక్కి వెళ్లిపోతుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్రలోని తడోబా అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ పులి ప్రధానంగా సింగరేణి మూసివేసిన, నిర్మానుష్యంగా ఉన్న శ్రీరాంపూర్, మేడిపల్లి ఒసిపిల్లోని అటవీ ప్రాంతంలోకి ప్రవేశించింది. పెద్దపులి వల్ల ప్రజలకు ఏలాంటి హాని కలగకుండా, అదేవిధంగా ప్రజల నుంచి పెద్దపులికి నష్టం కలగకుండా చూసేందుకు అటవీశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడ్తున్నారు. సి.సి.ఎఫ్. వెంట పెద్దపల్లి డిఎఫ్‌వో సిహెచ్.శివయ్య, ఎఫ్ఆర్‌వో టి.సతీష్‌కుమార్, నాయక్, రేంజ్ ఆఫీసర్ జి.కొమురయ్య, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌లు రహ్మతుల్లా, పెద్దపల్లి స్ట్రైక్ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దేశవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది, తెలంగాణ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. రఘునాథ్ డిమాండ్ చేశారు.సోమవారం రోజున స్థానిక పెద్దపెల్లి జిల్లా కోర్టు ఆవరణలోతెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఠాకూర్ అజయ్ క్రాంతి సింగ్, జనరల్ సెక్రటరీ కోటగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతూ భారత స్వతంత్రం కోసం జరిగిన పోరాటంలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమైందని, అలాగే తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు జరిగిన ఉద్యమంలో కూడా న్యాయవాదులు కీలక భూమిక పోషించారనిఅన్నారు.సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ముందు వరుసలో నిలిచిన బాధితుల పక్షాన పోరాడే వారు న్యాయవాదులే కానీ అలాంటి న్యాయవాదులపై దాడులు ,హత్యలు ఎన్నో జరుగుతున్నా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం తేవడంలో నిర్లక్ష్యంగా ఉన్నాయని అన్నారు. నేను బార్ కౌన్సిల్ కి ఎన్నుకోబడ్డ తర్వాత మొట్టమొదటిగా చేసి పని న్యాయవాదుల రక్షణ చట్టం తెచ్చే వరకు వెనకడుగు వేసేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ రెడ్డి, కల్చరల్ సెక్రటరీ నవీన్, సీనియర్ న్యాయవాదులు వి. తిరుపతి రావు, కుడిక్యాల శ్రీధర్, శ్రీపతి సత్తయ్య, బాదం రమేష్, ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్,మల్లేశం, యువ న్యాయవాదులు ,మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇదే స్ఫూర్తితో స్థానిక ఎన్నికల్లో కష్టపడి పని చేయండి

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నియోజకవర్గంలో 20 గ్రామాలు ఉండగా అత్యధికంగా, 11 మంది కాంగ్రెస్ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించిన కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు ను ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండలంలో 11 మంది కాంగ్రెస్ అభ్యర్థులు సర్పంచులుగా గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన రాజేందర్ రావును శభాష్ అని వారు అభినందనలు తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గంలోని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో గెలిచిన 11మంది కాంగ్రెస్ సర్పంచ్‌లు, ఉప సర్పంచులు వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాదులో సోమవారం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఘన విజయం సాధించిన సర్పంచులు ఉప సర్పంచులకు వేం నరేందర్ రెడ్డి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సర్పంచులు ఉప సర్పంచ్ లు గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకంతో సర్పంచులుగా ఉప సర్పంచులుగా గెలిపించారని వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అండగా నిలవాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో తమరి గెలుపునకు ప్రత్యేకంగా రాజేందర్రావు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎలగందుల సర్పంచ్ నిమ్మల అంజయ్య, ఉపసర్పంచ్ గసికంటి కుమార్, చేగుర్తి సర్పంచ్ భాషవేణి సరోజన మల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్ గాలిపెల్లి రవీందర్, నల్లగుంటపల్లి సర్పంచ్ వడ్లూరీ అంజయ్య, కమలాకర్ పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/గోదావరిఖని :** హైదరాబాద్ ఎంజె గార్డెన్ షాపూర్‌నగర్‌లో ఆదివారం జరిగిన 5వ నేషనల్ లెవెల్ కుంగుఫూ, కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రామగుండం ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. కటాస్ మహిళా జూనియర్ విభాగంలో ఇన్స్ బేగం ప్రథమ స్థానం, బాలుర జూనియర్ విభాగంలో ఎంఎ.రజిఅయాన్ ప్రథమ స్థానం, ఎండి.సయిద్ ద్వితీయ స్థానం, అండర్ 15 విభాగంలో ఎండి.అసలం, ఎండి.అల్తాఫ్‌లు ద్వితీయ స్థానాలు, ఎంఎ.అఫన్ తృతీయ స్థానం, అండర్ 18 విభాగంలో ఎంఎ.గౌసుద్దీన్ ద్వితీయ స్థానం, సీనియర్ విభాగంలో ఎం.ఎ.మజారుద్దీన్ ప్రథమ స్థానం గెలుపొందినట్లు శిక్షకులు ఎండి.సాజిద్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కరాటే విజేతలను మాస్టర్ మునీర్‌ఆలీ, ఎస్.ఐ. సంధ్యారాణి, ఠాకూర్ అయోధ్యసింగ్, సతీష్‌కుమార్, నాయకలు బందారపు బుగ్గరాములుగౌడ్, ఇసంపల్లి అంజయ్యలు అభినందించారు.

## పెద్దపులి బారి నుండి ప్రజలను రక్షించండి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరి నది పరివాహక ప్రాంతంలో పెద్దపల్లి సంచారంతో ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారని, పెద్దపులి వారి నుండి ప్రజలను రక్షించాలని సంబంధిత అధికారులు ప్రజల రక్షణ కై తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ పేర్కొన్నారు. గత మూడు రోజుల క్రితం సింగరేణి రామకృష్ణాపూర్ ఏరియా లోని ఆర్కెపి 8 ఇంక్లైన్ సమీపంలో పులి సంచారం వెలుగులోకి వచ్చిందని, దీంతో పులి గోదావరి నది దాటి రామగుండం దగ్గర లోని మూసి వేసిన మేడిపల్లి ఓసిపి సమీపం లోకి శనివారం రాత్రి ప్రవేశించి సంచరిస్తుండడం తో నది పరివాహక ప్రాంతంలో ఉన్న నివాసిత ప్రాంతాలు ఐన లింగాపూర్, గంగానగర్, జనగామ ప్రాంతంలో ఉన్న నివాసిత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజల రక్షణ కోసం ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమీప ప్రాంతాల ప్రజలు రాత్రి పూట ఒంటరిగా ప్రయాణం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## పోలింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు ఊరేగింపు నిషేదం

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండల కేంద్రంలో పలు గ్రామాలలో మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికలు సందర్భంగా స్థానిక ఎస్సై సిహెచ్ గణేష్ పలు సూచనలు చేశారు. స్థానిక ఎన్నికలు 17 తేదీ న ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జరగనున్న సందర్భంగా, ఎన్నికలు శాంతియుతంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయబడింది. 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉండటంతో ఐదుగురికి మించి గుంపులుగా గుమికూడరాదని తెలిపారు. 15 తేదీన సా.5.00 గంటల నుండి పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుంది. ఈ సమయంలో ప్రచారం, సభలు, ర్యాలీలు, లౌడ్‌స్పీకర్లు నిషేధం.పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి ప్రచారం, అడ్డంకులు ఉండరాదు. 200 మీటర్ల పరిధిలో బూత్‌లు అనుమతి లేదు. ఇతర వస్తువులు నిషేధం, పోలింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిషేధంఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలి

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జగిత్యాల చెందిన రాజ్యలక్ష్మి అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తదాత కావాలని చింత సుదీర్ కి సమాచారం అందిన వెంటనే స్పందించి తన తోటి డోనర్ జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో జిల్లా సంక్షేమ శాఖలో అకౌంటెంట్ విధులు నిర్వహిస్తున్న ఎన్. నరేష్ తన అమూల్యమయిన ఓ పాజిటివ్ రక్తన్ని దానం చేసి ఒక నిండు ప్రాణాన్ని కాపాడటానికి సహాయం చేసినందుకు నరేష్ ను చింత సుదీర్, పెషేంట్ కుటుంబ సభ్యులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బందిఅభినందించి కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం అనంతరం నరేష్ మాట్లాడుతూ తను 15 వ సారి రక్తదానం చేయడం అని రక్తదానం చేసి మరొకరికి ప్రాణాలు కాపాడడం సంతోషంగా ఉందని యువత రక్తదానానికి ప్రాధాన్యత ఇవ్వాలని నరేష్ కోరారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**ప్రజాపక్షం/ముధోల్ :** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు.సోమవారం మండల కేంద్రమైన ముధోల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన షబానా బేగంకు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాల్లో జరిగే సర్పంచుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.రెండేళ్ల కాంగ్రెస్ పరిపాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.ఇక్కడ సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ప్రతి ఒక్క దాన్ని నెరవేర్చడానికి



ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని ప్రజలను కోరారు.బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని విమర్శించారు.పంచాయతీ ఎన్నికల్లో విపక్షాలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులను పంచాయతీ ఎన్నికల్లో గెలిపిస్తే నిధులు తెచ్చేందుకు తనవంతుగా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఏజాజుద్దీన్, అఫ్రోజ్ ఖాన్,మాజీ ఎంపిటీసీ సభ్యుడు ఎస్డీ ఖాలీద్, షకీల్, అజర్, ఇమ్రాన్, స్థానిక నాయకులు,కార్యకర్తలు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### సహాయ కార్యదర్శి శివకుమార్



**ప్రజాపక్షం/బోధన్:** గ్రామ పంచాయతీ ఎన్నికల లో ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహాయ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి శివ కుమార్ సర్పంచ్ అభ్యర్థులకు, వార్డు మెంబర్లకు సూచించారు. సోమవారం రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గంగామణి గంగారాంలతో పాటు వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కొరకు ప్రజలకు సేవ చేయడానికి ఓటర్లు బాధ్యత అప్పగించారన్న విషయం మర్చిపోవద్దన్నారు. గ్రామాభివృద్ధిలో సహాయ స్వచ్ఛంద సంస్థ సహాయ సహకారాలు అందచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్య నిర్వహణాధికారి సాంబశివరావు, కె.సాయిలు, అనిల్ పటేల్, సయ్యద్ బషీర్, గంగారాం, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్నికల ప్రచార ఘట్టం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ గ్రామంలో మూడవ దఫా ఎన్నికల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా, పోటీలో ఉన్న సభ్యులు సోమవారంతో ప్రచార ఘట్టం పూర్తైంది. సోమవారం ఐదు గంటల తరువాత ఎవరూ కూడ ప్రచారం చేయకూడదని అధికారులు తెలిపారు.

## పోలీసు బందోబస్తుపై సమీక్ష

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించే విదంగా ఏర్పాట్లు చేయాలని పోలీసు కమిషనర్ పి.సాయిచైతన్య అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడవ విడత నిర్వహణలో భాగంగా ఆర్మూర్ ఏసిపి కార్యాలయంలో ఆర్మూర్ డివిజన్ పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళిని తూ.చా. తప్పకుండా పాటించాలన్నారు.గుంపులను చెదరగొట్టాలన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ బూతులో విధులు నిర్వహించాలన్నారు.

## ఎన్నికల విధులకు సిబ్బంది కేటాయింపు


**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** నిర్మల్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.మూడవ విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు రాండమైజేషన్ మండలాల వారిగా నిర్వహించారు.ఈ రాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.రాండమైజేషన్ ప్రక్రియ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు సరిపడినంత మంది ఆర్వో,ఓఆర్వోలను నియమించనున్నారు.ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.అవసరానికి 20 శాతం అదనంగా అధికారులను నియమించుకున్నట్లు పేర్కొన్నారు.దీనిద్వారా ఎన్నికల నిర్వహణలో అధికారుల కొరత తలెత్తకుండా ఉంటుందని అన్నారు.అధికారులతో మాట్లాడుతూ,గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి రెండు దశలను అధికారుల సమన్వయంతో పకడ్బందీగా పూర్తి చేశామని,మూడవ దశ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.మూడవ దశ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేశామని వివరించారు.ఈ రాండమైజేషన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్,డిపిఓ శ్రీనివాస్,డిఈఓ భోజన్న,జెడ్పి సీఈఓ శంకర్,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా.. సహకరిస్తా



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** మండలంలోని బన్సపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో గ్రామానికి చెందిన గజ్జల మల్లేష్ సర్పంచ్ గా విజయం సాధించాడు. గ్రామపంచాయతీలో మల్టీ వర్కర్‌గా (కారొబార్) 12 సంవత్సరాలు విధులు నిర్వహించి గ్రామ ప్రజలకు సేవలందించాడు.సర్పంచ్ రిజర్వేషన్ అనుకూలంగా రావడంతో మల్టీ వర్కర్ విధులకు రాజీనామా చేసి గ్రామ ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో సర్పంచ్ కు పోటీ చేసి గ్రామంలో చేసిన పనుల గురించి ప్రచారం నిర్వహించి ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రత్యర్థిపై 113 ఓట్లతో విజయం సాధించాడు.మల్లేష్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో గ్రామ ప్రజలు ఓటు వేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు.ప్రతి ఒక్కరికి ఏ సమస్య వచ్చినా ఎల్లవేళల అందుబాటులో ఉండి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.విజయం సాధించినందుకు గ్రామంలోని ప్రజలు యువకులు బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు.శాలువలతో సన్మానించడం జరిగింది.

## దాతృత్వాన్ని చాటుకున్న వేణుగోపాల కృష్ణన్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నీలిమ మల్టీస్పెషల్టి హాస్పిటల్ నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ వేణుగోపాల కృష్ణన్ గొప్ప సామాజిక సేవకు శ్రీకారం చుట్టా రు. ఈ శుభ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వాములకు దీక్ష ఇవ్వడంతో పాటు,వృద్ధులకు ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఏక్తా సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని,అన్నం పెట్టినవారు దేవతతో సమానమని పేర్కొన్నారు.మన ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా వృద్ధులకు కూడా అన్నదాన కార్యక్రమం చేపట్టి,వారికి సహకారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.డాక్టర్ వేణుగోపాల కృష్ణ పేద ప్రజల గురించి ఆలోచించి ప్రత్యేకంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు,అలాగే ఆయన ఎల్లప్పుడూ సామాజిక సేవలో పాల్గొని ఏక్తా వెల్ఫేర్ సొసైటీకి అండగా నిలుస్తున్నందుకు సొసైటీ అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల కృష్ణన్ మాట్లాడుతూ సొసైటీ అన్ని రంగాలలో నైపుణ్యతతో ముందుకు వెళుతుందని,నిర్మల్ యువకులు,పెద్దలు అందరూ తెలంగాణ ఏక్తా సోషల్ వెల్ఫేర్ సొసైటీకి సహాయ సహకారాలు అందించి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు(న్యూ అమర్ టెంట్ హౌస్ యజమాని) షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సాజిద్, డాక్టర్ గుండయ్య, నీలిమ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ సభ్యులు,ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

## రంగపేట సర్పంచ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఇటీవల జరిగిన మొదటి పంచాయతీ ఎన్నికల్లో ఖానాపూర్ మండలం రంగపేట సర్పంచ్ గా బీజేపీ అభ్యర్థి పెట్టం రాధ చంద్రశేఖర్ భారీ మెజారిటీతో గెలుపొందారు. బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ సోమవారం రంగపేట సర్పంచ్ పెట్ట రాధ చంద్రశేఖర్ దంపతులను అభినందించి శాలువాలతో సన్మానించారు.గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మల్లన్న పట్నాల మహోత్సవంలో పాల్గొన్న ఆయన రంగపేట సర్పంచ్‌తో పాటు ఎర్వచింతల్,బీర్నంది పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ పార్టీ జ్లిలా ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి,అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్,బుచ్చిమల్ల యాదవ్,వెంకటేష్, చంద్రమౌళి, దినేష్,పెట్టం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ధార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు,భారత మొదటి ఉప ప్రధాని సర్ధార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సర్ధార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు.దేశ సమైక్యత కోసం ధృడంగా నిలబడిన ఉక్కుమనిషి,సమైక్య శిల్పి అని సర్ధార్ వల్లభాయ్ పటేల్ సేవలను కొనియాడారు.అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. బిజెపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్,అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్,జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ కుమార్,మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్,పట్టణ ప్రధాన కార్యదర్శులు కొండవేణి రమేష్,జెట్టి సురేందర్,పుప్పాల పవన్,మదసు మురళి,రాపెల్లి రవీందర్,అసం సాయి,సందుపట్ల శ్రవణ్,దుర్గి అజయ్,గోదాపురం సందీప్,కొండజి ప్రశాంత్,ఎడ్ల రాజేశ్వర్,బత్తుల నారాయణ,కాలే రాజేందర్,తదితరులు పాల్గొన్నారు.

## వెనుకడుగు వేయని వైనం అభినందనీయం

**ప్రజాపక్షం/బోధన్:** పంచాయతీ ఎన్నికల్లో బెదిరింపులు, బలవంతపు ప్రయత్నాలు ఎన్ని ఉన్నా వెనకడుగు వేయని తమ బిజెపి అభ్యర్థుల ధైర్యం అభినందనీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఎంపిఆర్ కార్యాలయంలో సమావేశంలో మేడపాటి ప్రకాష్ రెడ్డి మాట్లాడారు. బోధన్ నియోజకవర్గంలో బిజెపి తరపున గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన 13సర్పంచ్‌లు, 8ఉప సర్పంచులు, 64వార్డు సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కందగట్ల రామ చందర్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి కుర్లే శ్రీధర్, పట్టణ అధ్యక్షులు గోపి కిషన్, రూరల్ అధ్యక్షులు సిర్ప సుదర్శన్, ఎడపల్లి అధ్యక్షులు ఇంద్రకరణ్, సాలూరా అధ్యక్షులు రావుబ గంగాధర్, వివిధ గ్రామాల బిజెపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా తీర్పు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసానికి ప్రతీక



**ప్రజాపక్షం / జైనూర్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి ప్రతీక అని ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. జైనూర్ మండలంలోని గౌరీ కొలామ్ గూడా గ్రామపంచాయతీ సర్పంచ్ ఆత్రం అయ్యు బాయీ భుజంగ్‌రావ్, ఉప సర్పంచ్ షేక్ ఫైసల్, వార్డ్ సభ్యులను సోమవారం లెండిగూడా గ్రామంలో మాజీ వైస్ ఎంపిపి షేక్ రషీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ రావ్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రజలకు చేరువగా ఉండి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలోనడిపించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పార్టీ అండతో పాటు తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజాపాలన చూసి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టం కడుతున్నారని, నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ప్రభుత్వ పథకాల గురించి తెలియజేస్తూ లబ్ధిపొందేలా చూడాలని కోరారు. ప్రజా పాలనకు ఆకర్షితులై బిఆర్ఎస్ నుంచి గౌరీ గ్రామానికి చెందిన మహెబూబ్, అయ్యూబ్, సలవుద్దీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు ఫెరోజ్ ఖాన్, మండల నాయకులు అజ్జులాల, దత్తు, రాంశావ్, వార్డ్ సభ్యులు షేక్ రహీం, షేక్ అబ్బు, షేక్ తాజు, ఖదీర్, షకీర్, షకీల్, స్థానిక వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముల్కల గ్రామంలో వెలిసిన దుర్గామాత

**ప్రజాపక్షం / హాజీపూర్ :** హాజీపూర్ మండలంలోని ముల్కల గ్రామంలో తవ్వకాలు జరపగా దుర్గాదేవి విగ్రహం బయటపడిందని హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చుంచు రాజు కిరణ్ తెలిపారు. ఇటీవల నాసిక్ నుంచి పర్యటనలో భాగంగా మంచిర్యాలకు వచ్చిన ముల్క్ పీఠాధిపతి రాజేంద్ర ఆచార్య గోదావరి నదిలో స్నానం చేసేందుకు వచ్చినప్పుడు అక్కడ అపూర్వమైన ఆధ్యాత్మిక శక్తి ఉన్నట్లు గుర్తించారని ఆయన పేర్కొన్నారు. ఆచార్య సూచన మేరకు వేద పండితుల ఆధ్వర్యంలో తవ్వకాలు చేపట్టగా దుర్గాదేవి విగ్రహం వెలిసిందని వివరించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులుతరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## స్వతంత్ర అభ్యర్థి పోసక్కకు సిర్సా గ్రామస్తుల మద్దతు

**ప్రజాపక్షం / చెన్నూరు :** గత పాలకుల అణచివేతతో విసిగిపోయిన సిర్సా గ్రామస్తులు సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థి గొడిశెల పోసక్కకు మద్దతుగా నిలుస్తున్నట్లు ప్రకటించారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని సిర్సా గ్రామంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి తమ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా అగ్ర వర్ణ కులం మాటున ఓ అధికార పార్టీ నేత తమను అణచివేతకు గురిచేస్తూ గ్రామంలో పెత్తనం చలాయిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు దాటినా నేటికీ తమ గ్రామంలో దొరల పాలనే సాగుతుందని వాపోయారు. గ్రామానికి వస్తున్న నిధులను దోచుకుంటూఅభివృద్ధికినోచుకోకుండా చేస్తున్నారని, దీనిపై ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాలకుల చేష్టలతో విసిగిపోయి సర్పంచ్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి పోసక్కకు మద్దతుగా నిలుస్తున్నట్లు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## కడ్తల్ సర్పంచ్,వార్డు మెంబర్ల అభివృద్ధి సంకల్పం

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** నిర్మల్ జిల్లా, సోన్ మండలంలోని కడ్తల్ గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గుర్రం రాము కాంగ్రెస్ నాయకులను కలిశారు.ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో వీరు కాంగ్రెస్ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీహరి రావును,మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి నిను కలుసుకున్నారు. తాము కడ్తల్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అంకితభావంతో కృషి చేస్తామని సర్పంచ్ గుర్రం రాము స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కడ్తల్ గ్రామ మాజీ సర్పంచ్ పోశెట్టి కూడా పాల్గొన్నారు.

## పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం / నస్పూర్ :** ప్రజల సౌకర్యార్థం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన తపాలా శాఖ ఉప కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ లో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యాలయం ద్వారా పొదుపు ఖాతాలు, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, పార్సిల్ సేవ, జీవిత భీమా, ఆర్డి, సుకన్య సమృద్ధి, టైం డిపాజిట్, పిపిఎఫ్, మంత్లీ ఇన్కమ్ స్కీం, సీనియర్ సిటిజన్, కిసాన్ వికాస్ పత్ర వంటి అన్ని తపాలా సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, తపాలా శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ ఆర్. రామారావు, సబ్ పోస్ట్ మాస్టర్ రవి, ప్రణబ్ తదితరులు పాల్గొన్నారు.

## 18న నస్పూర్ డిస్పెన్సరీలో 'వెల్‌బేబీ షో'



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 18న నస్పూర్ డిస్పెన్సరీలో వెల్ బేబీ షో నిర్వహిస్తున్నట్లు జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ పోటీల్లో శ్రీరాంపూర్ ప్రాంతంలో పని చేస్తున్న సింగరేణి ఉద్యోగుల పిల్లలు పాల్గొనవచ్చని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి ఐదేళ్ల వయస్సు గల పిల్లలు మాత్రమే ఈ పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు ఉద్యోగి ఐడి కార్డు, పిల్లల జనన తేదీ ధృవీకరణ పత్రం, రోగ నిరోధక టీకాల కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

## ఆరు గ్యారంటీలు మరిచి అవినీతి పాలన



బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

**ప్రజాపక్షం / చెన్నూరు :** ఆరు గ్యారంటీల అమలును మరిచి రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పాలన సాగిస్తుందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఏ బాల్క సుమన్ ఆరోపించారు. సోమవారం చెన్నూరు పట్టణ కేంద్రంలోవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమన్ మాట్లాడుతూ రెండు విడతల్లో నిర్వహించిన స్థానిక ఎన్నికల్లో గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత చూపిస్తూ బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తున్నారని తెలిపారు. రెండు రోజుల్లో నిర్వహించనున్న మూడవ విడత ఎన్నికల్లోనూ బిఆర్ఎస్ సర్పంచ్, వార్డు సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించి బస్సు చార్జీల పెంపుతో పురుషుల వద్ద దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటలను మర్చిపోయారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ అబద్దపు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. తన హయాంలో మంజూరైన వంద పడకల ఆసుపత్రి, వెజ్ నాన్ వెజ్ మార్కెట్, మినీ స్టేడియం, మినీ ట్యాంక్ బండ్, మహిళా భవనం, సిసి రోడ్లు, మిషన్ భగీరథ పనులను వివక్షతో నిలిపివేశారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనులు పూర్తి చేయకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గోదావరి, ప్రాణహిత ముంపు ప్రాంతాల ప్రజలకు కరకట్ట కడతామని చెప్పి వివేక్ మోసం చేశారని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ బ్యాక్ వాటర్ వల్ల జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు రాజా రమేష్, రాంలాల్ గిల్డా, మోతె తిరుపతి పాల్గొన్నారు.

## సర్పంచ్ రాజుకు బిజెపి సన్మానం



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని మంగులూరు గ్రామపంచాయతీ సర్పంచుగా బీజేపీ బలపరిచిన నర్మల రాజు సర్పంచుగా గెలుపొందారు. ఈ నేపథ్యంలో నిజాంసాగర్ మండల భాజపా అధ్యక్షుడు నరేష్ ఆధ్వర్యంలో రాజును శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపి ప్రభంజనం సృష్టించనుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలకు బ్యాండ్ సెట్ వితరణ

**ప్రజాపక్షం / జన్నారం :** మనవడి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలకు రూ. 15 వేల విలువైన బ్యాండ్ సెట్‌ను కూర రవీందర్, అరుణ దంపతులు సోమవారం బహుమతిగా అందజేశారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన కూర రవీందర్, అరుణ తమ కుమార్తె శివ శ్రుతి, అల్లుడు శివ సుమన్ కుమారుడు శివ శ్రేయాన్స్ జన్మదిన వేడుకలను అక్కపెల్లిగూడ ఎంపిపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ పుట్టినరోజు పేరిట ఆర్భాటాలకు పోకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే వస్తువును బహుమతిగా ఇవ్వడం అభినందించదగ్గ విషయమని అన్నారు. పాఠశాల తరపున దాతల కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు శెట్టి రాజశేఖర్, తేజ సుదీప, శ్రీలత పాల్గొన్నారు.

## వేధింపులు భరించలేక భర్తను హతమార్చిన భార్య

**ప్రజాపక్షం / మందమర్రి :** మద్యం మత్తులో నిత్యం వేధిస్తున్న భర్తను భార్య స్టీల్ రాడ్ తో కొట్టి హతమార్చింది. మందమర్రి పట్టణంలోని రాజీవ్ నగర్ లో ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్ నగర్ కు చెందిన మాటెటి చంద్రయ్య లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఇతను తరచూ మద్యం సేవించి భార్య లక్ష్మి, కుమార్తెను కొడుతూ వేధించేవాడు. ఆదివారం రాత్రి కూడా గొడవ జరగడంతో వేధింపులు భరించలేక లక్ష్మి స్టీల్ రాడ్ తో భర్త తలపై బలంగా కొట్టింది. దీంతో తీవ్ర రక్తస్రావమై చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి చెల్లెలు దుడం లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కేసును మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రంలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే

**ప్రజాపక్షం / మంచిర్యాల :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గంలో బిజెపి తరపున గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సోమవారం మంచిర్యాల పట్టణంలోని సుమిత్ర ఇన్ హాల్‌లో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బిజెపి వైపు మొగ్గు చూపారని తెలిపారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, అందుకే ప్రజలు బిజెపి అభ్యర్థులను గెలిపించారని పేర్కొన్నారు. కేంద్ర నిధులతో గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో జరిగే ఎంపిటిసి, జెడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అత్యధిక స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పురుషోత్తం జాజు, పెద్దపల్లి పురుషోత్తం, గాజుల ముఖేష్ గౌడ్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, కొయ్యల ఎమాజీ, ఎనగందుల కృష్ణ మూర్తి, జోగుల శ్రీదేవి, రమేష్ జైన్, బియ్యాల సతీష్ రావు, అశ్విన్, రమణ రావు, గుండా ప్రభాకర్, అమిరిశెట్టి రాజ్ కుమార్, కుర్రె చక్రవర్తి, సత్రం రమేష్, బండెల రవి గౌడ్, నాగిరెడ్డి హేమంత్‌రెడ్డి ఉన్నారు.

# కుంటాలలో విలక్షణ తీర్పు..

## యువ న్యాయవాదికి పట్టం కట్టిన ఓటర్లు

ప్రజాపక్షం/కుంటాల: కుంటాల మండల కేంద్రంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్లు విలక్షణ తీర్పుని చ్చారు. యువకులు, విద్యావంతులు, మేధావులు, మహిళలు తదితరులు 30 సంవత్సరాల యువ న్యాయవాదికి పట్టం కట్టారు. కుంటాలలో జరిగిన హోరాహోరీ ఎన్నికల పోరులో ప్రత్యర్థి వర్గాలు డబ్బు, మద్యం విచ్చలవిడిగా వెదజల్లినా ప్రలోభాలకు లొంగ



కుండా యువ న్యాయ వాదికి పట్టంకట్టి ఓటర్లు తమ చైత న్యాన్ని చాటుకున్నా రు. యువకులు జక్కుల గజేందర్ అనే న్యాయవాది గెలుపును తమ భుజ స్కంధాలపై వేసుకుని విజయ దుందుబి మోగిం చారు.

### ప్రజాసేవకే అంకితం అవుతా : సర్పంచ్ జక్కుల గజేందర్

తన పై ఎంతో నమ్మకం ఉంచి 700 పై చిలుకు మెజా రీతో గెలిపించిన కుంటాల ఓటర్లకు సర్పంచ్ జక్కుల గజేందర్ కృతజ్ఞతలు తెలిపారు. 5 సంవత్సరాలలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అదర్శ కుం టాల గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. పాలకు డిగా కాకుండా సేవకుడిగా పని చేస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. సర్పంచ్‌ను, వార్డు సభ్యులను ప్రజలు సన్మానించారు.

## గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

### మేడపాటి ప్రకాష్ రెడ్డి

ప్రజాపక్షం/ఎడపల్లి: నూతనంగా ఎన్నికైన సర్పం చులు గ్రామ అభివృద్ధికి పాటుపడి, తమ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. గెలు పొందిన సర్పంచ్ అభ్యర్థులకు ఎంపీ అరవింద్ సహా య సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని ఆయన స్పష్ట ం చేశారు. సోమవారం ఠాణాకలాన్ గ్రామంలో బిజెపి బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి అలేఖ్య శ్రీనివాస్ గెలుపొం దిన సందర్భంగా మేడపాటి ప్రకాష్ రెడ్డి, ఎడపల్లి బిజెపి నాయకులు కలిసి విజేతలను, నూతన పాలకవ ర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా వారికి మేడ పాటి ప్రకాష్ రెడ్డి, బిజెపి మండల శాఖ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేడపాటి మాట్లాడుతూ.. ఎడ పల్లి మండలంలో ముగ్గురు బిజెపి బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు, పలువురు వార్డు సభ్యులు గెలుపొందడం శుభ సూచకమని అన్నారు. బిజెపి సర్పంచులు ఉంటే ఇలా ఉండాలనే విధంగా సర్పంచులు, వార్డు సభ్యులు కలిసి కట్టుగా గ్రామ అభివృద్ధిలో పాల్గొనాలని సూచిం చారు. సర్పంచ్ అభ్యర్థులు తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా నెరవేర్చాలని కోరారు. గత ఐదు సంవత్సరాల క్రితం బిజెపి సర్పంచులు ఒక్కరు కూడ లేరని, కానీ నేడు ఈ సంఖ్య 20కి పైగా పెర గడం పార్టీ బలాన్ని సూచిస్తుందన్నారు. దీన్ని మార్గద ర్శకంగా తీసుకొని రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్ని కల్లో బిజెపి విజయదుందుబి మోగించాలని ఆకాంక్షిం చారు.ఇదే స్ఫూర్తితో బిజెపి శ్రేణులు పనిచేస్తే ఎంపీ టీసీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే స్థానాలను సైతం కైవసం చేసుకోవడం అసాధ్యమేమీ కాదని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి అభ్యర్థులను బలపర్చిన ప్రజలందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎడపల్లి మండల అధ్యక్షుడు ఇంద్రకరణ్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీధర్, మాజీ మండల అధ్య క్షుడు కమలాకర్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు, ఎడ పల్లి సర్పంచ్ చింతల్ రాం చందర్, మల్లెపూల శ్రీనివాస్, ఉప సర్పంచ్ చింతల్ వారి రవి, చిన్నరెడ్డి, బంజ గంగాధర్, గుండా శ్రీనివాస్, ఇసపల్లి గంగారాం, సాయి కిరణ్, నిఖిల్, శశికాంత్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన కాంగ్రెస్ నాయకులు ఆత్మెల శ్రీనివాస్



ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఆత్మెల శ్రీనివాస్ సోమవారం బిజెపి లో చేరారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బోధన్ నియోజకవర్గ బిజెపి నాయకులు మేడ పాటి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మెల శ్రీనివాస్ కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సంద ర్భంగా మేడపాటి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మెల శ్రీనివాస్ చేరికతో బిజెపి మరింత బలో పేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో బిజెపిని మరింత పటిష్టం చేసి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తామని ఆయన తెలియచే శారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్య క్షులు కందగట్ల రామచందర్, బోధన్ పట్టణ అధ్యక్షులు గోపి కిషన్, రూరల్ అధ్యక్షులు సిర్ప సుదర్శన్, ఎడపల్లి మండల అధ్యక్షులు ఇంద్రక రణ్, సాలూర అధ్యక్షులు రావుల గంగాధర్‌తో పాటు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపికే మెజారిటీ స్థానాలు

ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన లోలం గ్రామ సర్పంచ్ నూర శ్రీలత,ఆమెతో పాటు గెలిచిన వార్డు సభ్యులను నిర్మల్ శాసన సభ్యులు (ఎమ్మెల్యే)ఏలేటి మహేశ్వర్ రెడ్డి సత్కరించారు.సోమవారం రోజున జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ,నూతనంగా ఎన్నికైనా సర్పంచ్,వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలి పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో అత్యధిక స్థానా లలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) బలపరిచిన అభ్య ర్థులే మెజార్టీతో విజయం సాధించారని పేర్కొన్నారు.



బీజేపీ సీనియర్ నాయకులు మంద మల్లేష్, మాజీ సర్పంచులు కన్నా సాయన్న,రామా గౌడ్,బట్టు గంగం రాజు, ద్యాగ ప్రశాంత్, హుస్సేన్, ఉంగరాల రాజు, పెంట మహేష్, కరుణాకర్, దేవరాజ్, రమేష్, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల అధికారి అనైతికంగా వ్యవహరించారు..



ప్రజాపక్షం/బోధన్: గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నిక లలో బోధన్ డివిజన్ పరిధిలోని కల్దుర్కి గ్రామ పంచాయతీ ఓట్ల లెక్కింపులో ఎన్నికల నిర్వహణ అధికారి అనై తికంగా వ్యవహరించా లని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు అధికారుల దుర్వినియోగంతో బలవంతంగా అధికార పార్టీ అభ్యర్థి పేరు ప్రకటించడం జరిగిందని ప్రజలందరికీ కోరిక మేరకు న్యాయబద్ధంగా కల్దుర్కి గ్రామం ఓట్లు రికౌంటింగ్ నిర్వహించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామ సర్పంచ్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో తీవ్ర అవకతవ కలు జరిగినట్లు ఆరోపించారు. మొదటి విడత ఎన్నిక లలో కల్దుర్కి గ్రామంలో ఆరుగురు అభ్యర్థులు పోటీ చేయడం జరిగిందని ఓట్ల లెక్కింపులో బిజెపి అభ్యర్థి న్యాలం శ్రీనివాస్ గుర్తు టీవీ రిమోట్ కాగా అధికార పార్టీ అభ్యర్థి జొన్నల నరేందర్ రెడ్డి గుర్తు ఫుట్‌బల్ గుర్తు , ఎన్నికల నిర్వహణ అధికారులు ఇద్దరికీ సమాన ఓట్లు వచ్చినట్లు మొదటగా ప్రకటించారని అధికార దుర్విని యోగంతో అధికార పార్టీ అభ్యర్థి పేరు ప్రకటించడం జరిగిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టాలని పారదర్శకంగా మళ్లీ ఓట్ల లెక్కింపు జరపా లని విజ్ఞప్తి చేశారు. లేనిచో న్యాయ పోరాటం చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎడపల్లి సర్పంచ్ కందకట్ల రామ చందర్, బిజెపి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీధర్, బోధన్ మండల అధ్య క్షుడు సిర్ప సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు గోపి కిషన్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కల్దుర్కి గ్రామ సర్పంచ్ అభ్యర్థి న్యాలం శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ మాధవ రావు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొ న్నారు.

## పెన్షన్ అనేది హక్కు..

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : రాష్ట్ర అభి వృద్ధికి జీవిత కాలం సేవలందించిన పెన్షనర్లను నేటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, పెన్షన్ అనేది పెన్షనర్ల హక్కు, భిక్ష కాదని నిజా మాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారా యణ గుప్తా అన్నారు. సోమవారం స్థానిక పెన్ష నర్స్ భవన్లో అఖిల భారత పెన్షనర్స్ డే సంద ర్భంగా జిల్లా స్థాయి ప్రభుత్వ విశ్రాంత ఉద్యో గుల క్రీడా పోటీలు 2025లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధనకు ముందు వరుసలో ఉంటా నని హామీ ఇచ్చారు.

## తుదివిడత పోలింగ్ సిబ్బంది కేటాయింపు

ప్రజాపక్షం/నిజామాబాద్ : గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహ ణలో భాగంగా మూడవ విడతలో ఎన్నికలు జరిగే మండలాల పోలింగ్ సిబ్బంది తుది ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎన్నికల సాధారణ పరిశీల కులు శ్యాంప్రసాద్‌లాల్ సమక్షంలో సోమవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోనిఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలననుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపిం చారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఏకగ్రీవమైన వాటిని మినహాయిస్తూ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న మిగిలిన గ్రామపంచాయతీలకు సంబంధించి ఒక్కో మండలం వారిగా ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్‌అధికారులు, ఓపీఓ లను ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. ఈ ప్రక్రియలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, నోడల్ అధికారి పవన్‌కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

## జైతాపూర్ గ్రామంలో దొంగతనం

### రూ.8.5 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు చోరీ

ప్రజాపక్షం/ఎడపల్లి: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో భారీ చోరీ చోటుచేసుకుంది. ఆరు నెలలుగా హైదరాబాద్‌లో ఉన్న ఒక కుటుంబం ఇంటికి తిరిగి వచ్చే సరికి, తాళం పగులగొట్టి, బీరువాలో దాచి ఉంచిన 5.3తులాల బంగారం, 50తులాల వెండి వస్తువులు, రూ. 55వేల నగదుతో పాటు మొత్తం సుమారు రూ. 8.5లక్షల విలువైన ఆస్తితో పాటు ఇత్తడి, స్టీల్, రాగి పాత్రలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితు రాలు కంటిపూడి సుభశ్రీ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుభాశ్రీ తన తల్లి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆరు నెలల క్రితం ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి వారు అక్కడే నివసిస్తున్నారు. నెల రోజుల క్రితం సుభశ్రీ పెన్షన్ విషయమై గ్రామంలోని తమ ఇంటికి వచ్చి చూసుకొని తిరిగి తాళం వేసి హైద రాబాద్‌కు వెళ్లారు. ఇటీవల డిసెంబర్ 11న జరిగిన గ్రామ పంచా యతీ ఎన్నికల్లో ఓటు వేయడానికి సుభశ్రీ తన తల్లితో కలిసి జైతపూ ర్‌కు వచ్చారు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చి చూడగా, ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి ఆందో ళన చెందారు. లోపలికి వెళ్లి చూడగా, బీరువా తెరిచి ఉండటం, అందులో ఉన్న విలువైన వస్తువులు మాయం అవ్వడం చూసి నిర్ఘాంతపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించ డంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిం చారు. అజ్ఞాత వ్యక్తులు తాళం పగులగొట్టి ఈ దొంగతనానికి పాల్ప డ్డారని బాధితురాలు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. తాళం వేసి ఎక్కువ కాలం ఉన్న ఇళ్లను దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

## మద్యం మత్తులో తండ్రిపై కొడుకు దాడి

### ఎడపల్లి మండలం ఠానాకలాన్‌లో ఘటన

ప్రజాపక్షం/ఎడపల్లి: మద్యం మత్తులో ఉన్న ఓ కొడుకు తన తండ్రితో గొడవపడి, ఆవేశంలో ఇటుక తో దాడి చేసిన దారుణ ఘటన నిజామాబాద్ జిల్లాలోని ఎడపల్లి మండలంలో ఠానా కలాన్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఠానాకలాన్ గ్రామా నికి చెందిన షేక్ అమీరుద్దీన్ ఫిర్యాదు మేరకు ఈ విషయం వెలుగు లోకి వచ్చింది. అమీరుద్దీన్ పెద్ద కుమారుడైన షేక్ నజీరుద్దీన్ మద్యానికి బానిసై, నిత్యం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడే వాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కారణంగానే అతని భార్య కూడా అతడిని విడిచి వెళ్లిపోయినట్లు తెలిసింది. డిసెంబర్ 12న రాత్రి నజీరుద్దీన్ మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. ఈ సంద ర్భంగా అతను తన తండ్రి అమీరుద్దీన్‌తో గొడవకు దిగి, తీవ్రంగా దూషించాడు. అనంతరం ఆవేశాన్ని ఆపుకోలేక సమీపంలో ఉన్న ఒక ఇటుకతో తండ్రి చెంపపై బలంగా కొట్టాడు. ఈ దాడిలో షేక్ అమీరుద్దీన్‌కు రక్తస్రావంతో గాయమైనట్లు ఫిర్యాదులో తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. మద్యం మత్తులో కొడుకు తండ్రిపైనే దాడికి పాల్పడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశ మైంది.

# ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** 3వ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పొరపాట్లకు తావు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. సోమవారం వెంకటాపురం, వాజేడు, ఎంపిడిఓ కార్యాలయాల్లో, కన్నాయిగూడెం రైతు వేదికలో వేరు వేరుగా మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా మండల ప్రత్యేకాధికారి, తహసీల్దారు, ఎంపిడిఓ, ఎంపిఓ, జోనల్ ఆఫీసర్స్, ఆర్వోలు, మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలను పకడ్బందీగా పారదర్శకంగా, నిబంధనలు పాటిస్తూ ఎన్నికల విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు. అధికారులు ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి పోలింగ్ డే రోజున ఎలాంటి లోపాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, అధికారులు విధులకు గైర్హజరైతే చర్యలు తీసుకుంటామని, పోలింగ్ సిబ్బంది చెక్ లిస్ట్ ప్రకారం ఓటింగ్ మెటీరియల్ క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అన్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ బ్యాలెట్ పేపర్స్ క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కౌంటింగ్ పూర్తయిన వెంటనే సిబ్బంది జాగ్రత్తగా సీల్ వేసి సామాగ్రిని డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమస్యాత్మకమైన ప్రాంతాలలో సిగ్నల్ అందుబాటులో ఉన్న పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పర్యవేక్షిస్తున్నామని, సిగ్నల్ అందుబాటులో లేని పోలింగ్ కేంద్రాలలో వీడియోగ్రఫీ ద్వారా మైక్రో అబ్జర్వర్ పరిశీలనలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది ఉదయం 10గంటల వరకు పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల్లో మెటీరియల్ తీసుకున్న సిబ్బంది కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకొని 17వ తేదీన ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలింగ్ ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు జరుగుతుందని తెలిపారు. తదుపరి ఖచ్చితంగా మధ్యాహ్నం 2గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. అని పోలింగ్ కేంద్రాలలో వీల్ చైర్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 2గంటలకు ప్రారంభం కావాల్సిన ఓట్ల లెక్కింపు ఆలస్యం జరిగితే తెలియజేయాలని, ఆలస్యానికి కారణాలు తెలియజేస్తూ ఎన్నికల సంఘానికి తెలియజేయాల్సి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన వెంటనే సాధారణ ఎన్నికల పరిశీలకుల అనుమతితో డిక్లర్ చేయాలని తెలిపారు. ప్రజలందరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా గ్రామాభివృద్ధి కోసం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వాజేడు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లోని పోలింగ్ సామాగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, జోనల్ ఆఫీసర్లు, ఆర్వోలు, మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బచ్చన్నపేట మండల సర్పంచ్‌లు వీరే

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** బచ్చన్నపేట మండల సర్పంచ్‌ల జాబితాను అధికారులు విడుదల చేశారు. ఆలీం పూర్ పాకాల నాగలక్ష్మి (బీఆర్ఎస్), కొడవటూర్ నీల కవిత (బీఆర్ఎస్), బసిరెడ్డిపల్లి నల్ల సిద్ధి నర్సమ్మ (కాంగ్రెస్), మన్‌సాన్‌పల్లి గీస సందీప్ (బీజేపి), లింగంపల్లి మద్దికుంట రాధ (బీఆర్ఎస్), నాగిరెడ్డిపల్లి బంగారు రవికుమార్ (బీఆర్ఎస్), గోపాల్ నగర్ పేరబోయిన కళ్యాణి (బీఆర్ఎస్), కట్కూర్ బల్లు రవికుమార్ (కాంగ్రెస్), చిన్నరామన్‌చర్ల ఎండీ ఆజాం (బీఆర్ఎస్), నారాయణపూర్ పరిదె స్వప్న (కాంగ్రెస్), బండనాగారం ఇజ్జగిరి రాములు (కాంగ్రెస్), లక్ష్మాపూర్ నూకల కల్పన (బీఆర్ఎస్), సాల్వాపూర్ మిద్దెల శ్రీధర్‌గౌడ్ (బీఆర్ఎస్), దబ్బగుంటపల్లి కొంత చంద్రకళ (బీఆర్ఎస్), బోనకొల్లూరు చిక్కుడు కల్పన (కాంగ్రెస్), నక్కవానిగూడెం పోతుల వెంకటేష్ (బీఆర్ఎస్), వీఎస్ఆర్ నగర్ గౌడుగు రేణుక (కాంగ్రెస్), కోడూరు స్వర్ణలత (బీఆర్ఎస్ ), కేశిరెడ్డిపల్లి రవి కుమార్ (బీఆర్ఎస్), తమ్మడపల్లి బేజాడి సిద్దులు (బీజేపి), ఇటికాల పల్లి జేరిపోతుల రాజు (కాంగ్రెస్), పడమటి కేశవాపూర్ ఎర్రోళ్ల విజయ (బీఆర్ఎస్), గంగాపూర్ జిల్లెల్ల బాస్కర్ రెడ్డి (బీఆర్ఎస్), బచ్చన్నపేట అల్వాల నర్సింగరావు (కాంగ్రెస్), పోచన్నపేట ఎండీ ఫిరోజ్ (బీఆర్ఎస్), రామచంద్రాపూర్ వినోద్‌రెడ్డి (స్వతంత్ర) ఏకగ్రీవం.

# ఎమ్మెల్యే కడియంను కలిసిన కుర్చపల్లి సర్పంచ్

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ఇటీవల జరిగిన మొదటి విడుత గ్రామ పంచాయితీ ఎన్నికలలో మండలంలోని కుర్చపల్లి గ్రామంలో స్వత ంత్ర అభ్యర్థి బైకాని రాజు, వార్డు సభ్యులంతా కలిసి సోమవారం హ న్మకొండలోని మాజీ మంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీ హరి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కడియం ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన నూతన సర్పంచ్, వార్డు సభ్యులను అభినందించ డం జరిగింది.

# ఎన్నికలకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

## జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఈ నెల 17న జరగనున్న మూడో విడత ఎన్నికల నిర్వహణకు కాటారం సబ్ డివిజన్‌లోని మహాదేవపూర్, కొయ్యూరు, కాటారం, ముత్తారం మండలాల్లో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మంగళవారం సైలెంట్ పీరియడ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కావున పోలింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి ఎన్నికల సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం,లౌడ్‌స్పీకర్ల వినియోగం, ర్యాలీలు మరియు బైక్ ర్యాలీల నిర్వహణ పూర్తిగా నిషేధించబడిందన్నారు.పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమని తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడటం నిషేధమన్నారు. అభ్యర్థులు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లకు వెలుపల ఒకే ఒక్క సహాయక బూత్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ ప్రాంగణంలో లేదా 100 మీటర్ల పరిధిలో మొబైల్ ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. అక్రమ మద్యం రవాణా, నిల్వ లేదా విక్రయాలకు పాల్పడిన వారిపై, అలాగే మద్యం, డబ్బు లేదా ఇతర ప్రలోభాలు పంపిణీ చేసిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నించినా, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు లేదా విద్వేషపూరిత ప్రచారాలు నిర్వహించినా, అటువంటి వారిపై కేసులు నమోదు చేసి, అవసరమైతే షీట్ కూడా ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు.

# 18 నుండి హనుమకొండ జిల్లా స్థాయి సైన్స్ ఫేయిర్

## జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్‌గౌడ్

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్:** ఈనెల 18 నుండి 20 వరకు హనుమకొండ విద్యానగర్ లోని సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్లో (టీవీ టవర్ దగ్గర) నిర్వహిస్తున్న హనుమకొండ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరా జ్ గౌడ్ సమీక్షించారు. సైన్స్ ఫెయిర్ ను విజయవంతంగా నిర్వహించడానికి ఏర్పాటు చేసిన వివిధ కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లు,మెంబర్ల ను ఉద్దేశించి సైన్స్ ఫెయిర్ జరిగే సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్లో జిల్లా సైన్స్ అధికారి ఎన్.శ్రీనివాస స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ నిర్వహణకు సమయం తక్కువగా ఉన్నా ,ఎన్నికల విధుల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తలమునకలై ఉన్నా కూడా వివిధ కమిటీల ఆధ్వర్యంలో తమకు కేటాయించిన విధులు నిర్వహించి సైన్స్ ఫెయిర్ ను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుండి ఎక్కువమంది విద్యార్థులు సైన్స్ ఫెయిర్ ను సందర్శించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వివిధ పాఠశాలల నుండి విద్యార్థులను సైన్స్ ఫెయిర్ కు తీసుకువచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. 19వ తారీకు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు హనుమకొండ, హసన్ పర్తి, ఆత్మకూరు మండలాల పాఠశాల విద్యార్థులను, అదేరోజు మధ్యాహ్నం 1.30 నుండి సాయంత్రం 4:30 వరకు పరకాల, శాయంపేట, భీమదేవరపల్లి, వేలేరు మండలాల విద్యార్థులను, 20వ తారీకు శనివారం ఉదయం 9:30 నుండి 1:00 వరకు కమలాపురం, ఎలకతుర్తి, నడికుడ మండలాల విద్యార్థులను, అదే రోజు మధ్యాహ్నం 1:30 నుండి 4:30 వరకు దామెర, ధర్మసాగర్, కాజీపేట, ఐనవోలు మండలాల విద్యార్థులను జిల్లా సైన్స్ ఫెయిర్ సందర్శనకు తీసుకురావాలని ఆయన కోరారు. సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల అధినేత నారాయణరెడ్డి, వడుప్సా ప్రతినిధులతో పాటు హనుమకొండ ఎంఈఓ నెహ్రూ నాయక్, హసన్ పర్తి ఎంఈఓ శ్రీనివాస రెడ్డి, కాజీపేట ఎంఈఓ మనోజ్ కుమార్, సీఎంఓ బద్దం సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి సైన్స్ ఫెయిర్ జరగనున్న సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల భవనాలను పరిశీలించారు.

# మూడో విడత పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** 3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం నుండి 3వ విడత గ్రామ పంచాయతి ఎన్నికలు జరుగనున్న కాటారం, మల్హర్, మహదేవపూర్, మహా ముత్తారం మండలాల రెవెన్యూ, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 3వ విడత నిర్వహణలో భాగంగా 16న పోలింగ్ మెటీరియల్ పంపిణీ, 17న పోలింగ్, 2 గంటల తదుపరి ఓట్లు లెక్కింపు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. మొదటి, రెండవ విడతల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించారని భాగస్వాములైన అధికారులను, సిబ్బందిని అభినందించారు. అదే స్ఫూర్తితో 3వ విడత జరుగనున్న ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. విధులు కేటాయించిన సిబ్బంది 16వ తేది ఉదయం 10 గంటల వరకు మెటీరియల్ పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తదుపరి పరిశీలన అనంతరం కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 17న జరుగనున్న పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. 17న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కావాలని తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, తదుపరి మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాం క్ సింగ్, ట్రైని డిప్యూటీ కలెక్టట్ నవీన్ రెడ్డి, డిపిఓ శ్రీలత, డీఈఓ రాజేందర్, డిఆర్డీఓ బాలకృష్ణ, నాలుగు మండలాల ఎంపీడీఓలు, తహసిల్దారులు, ఎంపీఓలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/వాజేడు:** 3వ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పొరపాట్లకు తావు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ఆదేశించారు.సోమవారం వాజేడు, ఎంపీడీవో కార్యాలయాల్లో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్, ఎంపీడీవో, ఎంపీఓ, జోనల్ ఆఫీసర్స్, ఆర్వోలు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా, నిబంధనలు పాటిస్తూ ఎన్నికల విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు.అధికారుల ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి, పోలింగ్ డే రోజున ఎలాంటి లోపాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎన్నికల సమయంలో ఎన్నికల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, అధికారులు విధులకు గైహాజరైతే చర్యలు తీసుకుంటామని, పోలింగ్ సిబ్బంది చెక్ లిస్ట్ ప్రకారం ఓటింగ్ మెటీరియల్ క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అన్నారు.సమస్యాత్మకమైన ప్రాంతాలలో సిగ్నల్ అందుబాటులో ఉన్న పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పర్యవేక్షిస్తున్నామని, సిగ్నల్ అందుబాటులో లేని పోలింగ్ కేంద్రాలలో వీడియోగ్రఫీ ద్వారా మైక్రో అబ్జర్వర్ పరిశీలనలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూఎలాంటిప్రలోభాలకు గురికాకుండా గ్రామాభివృద్ధి కోసంతమఓటుహక్కును వినియోగించుకోవాలని అన్నారు.

**ఎంపిడిఒపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్**

ఇటీవల నామినేషన్ల విషయంలో ఎన్నికల సిబ్బందికి భోజనాలు ఖర్చులకు సంబంధించిన నగదును పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వకుండా ఉందని కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయ తీరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఖర్చు పెట్టాల్సిన నగదు విత్ డ్రా చేయకుండా నిర్లక్ష్యం ఎందుకు ప్రదర్శించారని మండిపడ్డారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లోని పోలింగ్ సామాగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో మండల మండల స్పెషల్ ఆఫీసర్ సర్దార్ సింగ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ , ఎంపిఓ శ్రీకాంత్ నాయుడు, ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు, ఆర్ ఐ కుమారస్వామి, జోనల్ ఆఫీసర్స్, ఆర్వోలు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.